సాక్షి నిజామాబాద్
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



మార్కెట్‌కు క్రిస్మస్ కళ

నగరంలోని మార్కెట్‌కు క్రిస్మస్ కళ వచ్చింది. వివిధ వస్తువుల కొనుగోళ్లతో సందడిగా మారింది.

- 10లో ▸



ప్రజావాణికి 149 ఫిర్యాదులు

నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 149 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ వినతులు స్వీకరించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.6 /16.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎలక్ట్రిక్ బస్సుల పరిశీలన



ఖలీల్ వాడి: నిజామాబాద్–2 డిపోలో ఎలక్ట్రిక్ బస్సులు, చార్జింగ్ పాయింట్‌లను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్ సోమవారం పరిశీలించారు.
ఆయనతో పాటు రీజినల్ మేనేజర్ శ్రీమతి జ్యోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ వి శంకర్, ఎన్ సరస్వతి, డిపో మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బేస్ బాల్ జట్టుకు కలెక్టర్ అభినందన



నిజామాబాద్ అర్బన్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 18 నుంచి 21 వరకు జరిగిన సీఎం కప్–2024 పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బేస్ బాల్ మహిళల జట్టును సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో ముత్తన్న, జిల్లా బేస్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ కుమార్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి ప్రిన్సిపల్ పి నళిని, సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల జిల్లా స్పోర్ట్ కోఆర్డినేటర్ నీరజ రెడ్డి, జిల్లా కోచ్ లు మౌనిక, హెచ్ అనికేత్ శ్రీలత, అంజలి పాల్గొన్నారు.

వాయుసేనలో అగ్నివీర్ పోస్టులు

నిజామాబాద్ అర్బన్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. అర్హులైన యువతీ, యువకులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండి, 2005 జనవరి 01 నుంచి 2008 జూలై 1 మధ్యన జన్మించి ఉండాలన్నారు. అర్హులైన వారు 2025 జనవరి 7 నుంచి జనవరి 27 లోపు https://agnipathvayu.cdac.in ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి 2025 మార్చ్ 22 నుంచి ఆన్లైన్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. జిల్లాకు చెందిన అర్హులైన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రశాంతంగా పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో పీజీ రెగ్యులర్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. పీజీ 1వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు 7వ, 9వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు 26 మంది విద్యార్థులకుగాను 26 మంది హాజరైనట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వంటా వార్పు



నిజామాబాద్ అర్బన్/ నిజామాబాద్‌సిటీ: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. సోమవారం నగరంలో వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని, సర్వీసులను రెగుల్యరైజ్ సమ్మె చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజు, ఉపేందర్, గంగామణి, రవి, కిరణ్, అప్సర్, ప్రకాశం పాల్గొన్నారు.

సమ్మెకు కేఏ పాల్ సంఘీభావం

కొన్ని రోజులుగా ధర్నా చౌక్‌లో సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్‌లు సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. సమస్యలను పరిష్కరించేలా చేయాలని ఉద్యోగులు గడుగు గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు.

యాసంగికి 63.85

రేపటి నుంచి ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీటి విడుదల

యాసంగి సీజన్‌కు గాను శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టనున్నారు. ఇందుకు గాను 63.85 టీఎంసీల నీటిని కేటాయించారు. కాకతీయ కాలువ ద్వారా రెండు జోన్‌లుగా నీటి విడుదల ఉంటుంది. మరోవైపు కాలువల్లో పూడిక పేరుకు పోగా, మొక్కలు పెరిగాయి. కాకతీయ, లక్ష్మి కాలువలు ప్రమాదకరంగా మారాయి. దీంతో చివరి ఆయకట్టు వరకు నీటి సరఫరా ఇబ్బంది కలిగేలా ఉంది. జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి టర్బయిన్‌లు సిద్ధంగా ఉన్నాయి. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేస్తేనే విద్యుదుత్పత్తి ప్రారంభమవుతుంది. మొత్తం నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతుంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ

- వారబందీ ప్రకారం ఏడు తడులుగా నీరందించేందుకు నిర్ణయం
- కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలకు రెండు జోన్‌లుగా విభజన

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల కల్పతరువు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి సీజన్‌కు బుధవారం నుంచి నీటి విడుదల చేపట్టడానికి ప్రాజెక్టు అధికారులు సిద్ధంగా ఉన్నారు. వారబందీ ప్రకారం నీటి విడుదల చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. కాకతీయ కాలువ ద్వారా ఏడు రోజులు జోన్–1కు 3500 క్యూసెక్కులు, ఎనిమిది రోజులు జోన్–2 కు 5500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తారు. లక్ష్మి, సరస్వతి కాలువలు, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు నీటి కేటాయింపులు చేపట్టారు.

కాలువలు, లిఫ్టుల ద్వారా..

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో కాలువలు, లిఫ్టుల ద్వారా నీటి విడుదలకు 63.85 టీఎంసీల నీటిని కేటాయించారు. అందులో కాకతీయ కాలువ ద్వారా 41.43 టీఎంసీలు, సరస్వతి కాలువ ద్వారా 7.26 టీఎంసీలు, లక్ష్మి కాలువ ద్వారా 3.16 టీఎంసీలు, అలీసాగర్ లిఫ్టు ద్వారా 2.29 టీఎంసీలు, గుత్పలిఫ్టు ద్వారా 1.14 టీఎంసీలు, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో గల టీఎస్ఐడీసీ లిఫ్టులకు కలిపి 2.83 టీఎంసీలు, మిషన్ భగీరథ ద్వారా 2.10 టీఎంసీలు విడుదలకు నిర్ణయించారు. ఆవిరి రూపంలో 3.63 టీఎంసీలు పోతాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 80.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. యాసంగి కేటాయింపుల నీరు పోగా 16.7 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. తాగు నీటి అవసరాల కోసం 5 టీఎంసీలు, డెడ్‌స్టోరేజీ 5 టీఎంసీలు పోను ఇంకా ప్రాజెక్టులో 6.7 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ఇందులో నుంచి కాకతీయ కాలువ ఆధారంగా అమర్చుకున్న పంపుసెట్‌లకు, ఆవిరి రూపంలో పోయే నీటిని కేటాయించారు.

పంపు సెట్‌లు అమర్చుకున్న రైతులకు..

ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా ఏడు తడులుగా నీటి విడుదల చేయనున్నారు. కాకతీయ కాలువ ద్వారా డీ–5 నుంచి డీ–53 కాలువలకు ఏడు రోజులు 3500 క్యూసెక్కులు, డీ54– డీ94 వరకు 8 రోజులు 5500 క్యూసెక్కుల నీటిని వదులుతారు. అంతే గాకుండా కాకతీయ కాలువ ఆధారంగా పంపు సెట్‌లను అమర్చుకున్న రైతులకు నీరు అందించేందుకు ప్రతి రోజు 500 క్యూసెక్కుల నీటిని కేటాయించారు. మిగతా కాలువల ద్వారా నిరంతరం నీటి విడుదల జరుగుతుంది. డిసెంబర్ 25 నుంచి 2025 ఏప్రిల్ 9 వరకు నీటి విడుదలను చేపడుతారు.

విద్యుదుత్పత్తికి సిద్ధం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న జల విద్యుత్తి కేంద్రంలో టర్బయిన్‌లు విద్యుదుత్పత్తికి సిద్ధంగా ఉన్నాయి. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేస్తేనే విద్యుదుత్పత్తి ప్రారంభమవుతుంది. మొత్తం నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. అయితే ప్రస్తుత యాసంగి సీజన్‌లో నాలుగు టర్బయిన్‌లు ఒకే సారి విద్యుదుత్పత్తి చేసే అవకాశం లేదు. ఒక్కో టర్బయిన్‌కు 2 వేల క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో కాకతీయ కాలువ ద్వారా గరిష్ఠంగా 5500 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తారు. విద్యుదుత్పత్తి చేపట్టాడానికి సిద్ధంగా ఉన్నామని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్ తెలిపారు.



మొక్కలతో నిండిపోయిన లక్ష్మి కెనాల్ ఉప కాలువ



పూడికతో నిండిపోయిన కాకతీయకాలువ తూము

అధ్వానంగా కాలువలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసే కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. కాలువల్లో పూడిక, మొక్కలు పేరుకుపోయాయి. ప్రధానంగా కాకతీయ, లక్ష్మి కాలువలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. కాలువ ఆనకట్టలు కుంగిపోయాయి. కాకతీయ కాలువ తూమ్‌ల వద్ద పూడిక పేరుకుపోయి నీరు పారేలా లేదు. సీజన్ ప్రారంభం ముందు కూడా అధికారులు కాలువల పూడిక తొలిగించుటకు ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. చివరి ఆయకట్టు వరకు నీటి సరఫరాకు ఇబ్బంది కలిగేలా ఉంది. అంతేగాకుండా నీటి వృథా తప్పడం లేదు.



విద్యుదుత్పత్తికి సిద్ధంగా ఉన్న టర్బయిన్‌లు

■ కబ్జా చేస్తున్నారు

నిస్సహాయం

- అంబులెన్స్‌లో ప్రజావాణికి వచ్చిన బాధితురాలు
- తన భూమిని అధికార పార్టీ నేతలు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు
- సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్



బాధితురాలితో మాట్లాడుతున్న ఆర్‌డీవో రాజేంద్రకుమార్

నిజామాబాద్ రూరల్: తన భూమిని కబ్జా చేస్తున్నారని, కాపాడాలని కోరుతూ అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఏకంగా అంబులెన్స్‌లో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కొండూరు గ్రామానికి చెందిన మణెమ్మ కొన్ని రోజుల క్రితం పక్షవాతానికి గురై మంచానికి పరిమితమైంది. ఆమెకు గ్రామ శివారులోని 199 సర్వేనెంబర్‌లో 38 గుంటల భూమి ఉంది. అయితే అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు తన భూమిని కబ్జా చేయడమే కాకుండా, బోరు వేయడానికి బోరుబండిని సైతం తీసుకువచ్చారని పేర్కొంటూ మణెమ్మ ప్రజావాణి కార్యక్రమానికి అంబులెన్స్‌లో వచ్చింది. ఇది తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆర్‌డీవో రాజేంద్రకుమార్‌ను ప్రజావాణి కార్యక్రమం నుంచి మణెమ్మ వద్దకు పంపించారు. బాధితురాలితో ఆర్‌డీవో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్, ఆర్‌డీవోలు వెంటనే సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అసలు భూమి ఎవరి పేరిట ఉంది, పట్టా పాస్‌పుస్తకాలు ఎవరిపేరు మీద ఉన్నాయి, ఆ భూమికి అసలైన యజమానులు ఎవరు విషయాలను సమగ్రంగా నివేదిక పంపాలని తహసీల్దార్‌కు సూచించారు. గతంలోనూ రెండు, మూడు సార్లు కలెక్టర్‌కు, అధికారులకు ఈ సమస్యను విన్నవించినా పరిష్కారం కాలేదని మణెమ్మ వాపోయింది. బాధితురాలికి కొడుకు ఉన్నాడు.

■ ఎలక్ట్రిక్ బైక్ ఇప్పించండి

దయనీయం



నిజామాబాద్ అర్బన్: ఉపాధికోసం దుబాయ్ వెళ్లిన వలస కార్మికుని దయనీయ పరిస్థితి ఇది.. మోపాల్ మండలం కంజర గ్రామానికి చెందిన నర్సింలు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తనకు ఎలక్ట్రిక్ బైక్ ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. గతంలో ఉపాధి పని కోసం దుబాయ్ వలస వెళ్లానని, అక్కడ రోడ్డు ప్రమాదం జరగడంతో రెండు కాళ్లు కోల్పోయినట్లు తెలిపారు. ప్రస్తుతం కుటుంబం గడవడం కష్టంగా ఉందన్నారు. కుటుంబం తనపైనే ఆధారపడి ఉందన్నారు. వినతి పత్రం స్వీకరించిన అధికారులు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. నర్సింలుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేనైతే రూ.300 కోట్లు ఇచ్చేవాడిని..

- తొక్కిసలాటలో చనిపోయిన రేవతి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 కోట్లు ఇవ్వాలి
- సీఎం రేవంత్ రెడ్డి పాలనలో నియంత పోకడలు
- నన్ను వేధించిన బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయింది
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ అభ్యర్థులు సత్తా చాటాలి
- మీడియాతో మాట్లాడిన కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

నిజామాబాద్ రూరల్: ఒక వేళ నేను అల్లు అర్జున్ అయి ఉంటే తొక్కిసలాటలో చనిపోయిన రేవతి కుటుంబానికి.. రూ.300 కోట్లు సహాయం చేసేవాడినని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.25 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన సద్దాం హుస్సేన్‌లాగా నియంత పాలన తలపిస్తోందన్నారు. హైడ్రా పేరిట 422 బిల్డింగ్‌లు అక్రమంగా కూల్చివేశారని, సీఎం తన తమ్ముడి బిల్డింగ్ ఎందుకు కూల్చలేదన్నారు. నాగార్జున బిల్డింగ్ ఎందుకు కూల్చారో సమాధానం చెప్పాలన్నారు. జనవరిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు , ఎంపీపీలు సత్తా చటాలన్నారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ నేతలు కృషి చేయాలన్నారు. తనను వేధించిన బీ ఆర్‌ఎస్ అధికారం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలేనని, రెండు ప్రభుత్వాల హయాంలో సర్పంచులు అప్పుల పాలయ్యారని అన్నారు. తన మద్దతుతోనే రేవంత్ సీఎం అయ్యాడన్నారు. సీఎం రేవంత్ నన్ను వాడుకొని వదిలేశాడన్నారు. పదవులు శాశ్వతం కాదు.. గుర్తు పెట్టుకో రేవంత్‌రెడ్డి అని కేఏ పాల్ హెచ్చరించారు. 22 దేశాల్లో ఇప్పటికే ప్రపంచ శాంతి సభలను పెట్టానని, అందులో ఒక్కరు కూడా తొక్కిసలాటకు గురై ఇబ్బందుల పాలు కాలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తన రాష్ట్రంలో అనేక సభలు పెట్టగా తొక్కిసలాటలో అనేక మంది గాయపడ్డారని గుర్తు చేశారు. ప్రపంచ శాంతిని కోరే తనను అనేక భయభ్రాంతులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ సర్పంచులు పార్టీలకు చెందినవారని, ప్రజాశాంతి పార్టీకి చెందిన సర్పంచులు ప్రజల మనుషులని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు, అవుట్ సోర్సింగ్ వారికి జీతాలు సరైన సమయంలో రా వడం లేదన్నారు. గతంలో లక్ష మంది టీచర్లు రో డ్డున పడ్డారని, అదేవిధంగా సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాశాంతి పార్టీ సర్పంచులు అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో సీసీలు, డ్రెయినేజీలు, మౌలిక వసతులతో పాటు, రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. 2025– 26లో జెమిలీ ఎన్నికలు వస్తాయని అందులో పోటీ చేయడానికి ప్రజాశాంతి పార్టీ నాయకులు సంసిద్ధంగా ఉండాలన్నారు. బీసీ, ఎస్సీ,ఎస్టీ వారు రాజ్యాధికారం కోసం పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

నిఖత్ తెలంగాణకు గర్వకారణం

- నిఖత్ జరీన్ ఫౌండేషన్ ప్రారంభంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ బిడ్డ, భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ తెలంగాణకు గర్వకారణమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు. సోమవారం హైదరాబాద్‌లో నిఖత్ జరీన్ ఫౌండేషన్ ప్రారంభ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిఖత్ జరీన్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బాబురావు, ఒలింపిక్ సంఘం మాజీ కోశాధికారి మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష నగదు బహుమతి: నిఖత్

పేద, మధ్య తరగతి బాక్సర్లకు ఫౌండేషన్ ద్వారా తోడ్పాటు అందించనున్నామని నిఖత్ జరీన్ వెల్లడించారు. వచ్చే జాతీయ బాక్సింగ్ పోటీల్లో పతకాలు కొల్లగొట్టే తెలంగాణ బాక్సర్లకు ఫౌండేషన్ ద్వారా నగదు బహుమతి అందించనున్నామన్నారు. స్వర్ణం గెలిచిన వారికి రూ.1 లక్ష, రజతం నెగ్గితే రూ.75 వేలు, కాంస్యం సాధిస్తే రూ.50 వేలు ప్రదానం చేస్తామన్నారు. రాష్ట్రంలో విరివిగా బాక్సింగ్ పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.



నిఖత్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, తదితరులు

పీఎస్‌లకు అప్‌గ్రేడ్ లేనట్టేనా?

- జిల్లాలోని 16 పోలీస్‌స్టేషన్లపై నివేదిక అందించిన గత సీపీలు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- రామగుండం, ఖమ్మం, సైబరాబాద్ కమిషనరేట్‌లలో అప్‌గ్రేడ్!



ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్‌లోని పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్ ఇప్పట్లో అయ్యేలా కనబడటం లేదు. ఇప్పటి వరకు కమిషనరేట్‌లో పనిచేసిన ముగ్గురు సీపీలు గతంలో ప్రభుత్వానికి పలుమార్లు నివేదికలు పంపినా పట్టించుకోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రామంగుండం, ఖమ్మం, సైబరాబాద్ కమిషనరేట్‌లో పలు ఠాణాలను అప్‌గ్రేడ్ చేసింది. కానీ జిల్లాలోని స్టేషన్లను మాత్రం పట్టించుకోకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 33 పోలీస్‌స్టేషన్లు..

పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళ పోలీస్ స్టేషన్‌ను కలుపుకుని 33 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో 16నుంచి 18ఠాణాలను ఇటీవల బదిలీ అయిన సీపీ కల్మేశ్వర్ అప్‌గ్రేడ్ కోసం ప్రతిపాదనలు పంపారు. గతంలో ఇక్కడ పని చేసిన సీపీలు కార్తికేయ, కెఆర్ నాగరాజు కూడా నివేదికలు అందించారు. పోలీస్‌స్టేషన్లలో వచ్చిన క్రైమ్స్ సంఖ్యను బట్టి ఆ ఠాణాలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుంది. క్రైమ్స్ సంఖ్యను నివారించడానికి పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేయాలని గత సీపీలు ప్రభుత్వానికి నివేదికలు అందించారు.

ప్రభుత్వం పోలీస్‌స్టేషన్ల అప్‌గ్రేడ్ కోసం వివరాలను అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా నుంచి పోలీస్‌స్టేషన్ల జాబితాతోపాటు క్రైమ్ వివరాలను అందులో వివరించినట్లు సమాచారం. అయినప్పటికీ అవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

ప్రజాప్రతినిధులు దృష్టిసారిస్తే..

పీఎస్‌ల అప్‌గ్రేడ్ కోసం జిల్లాకు చెందిన టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంది. ఇప్పటికే హైదారాబాద్‌లోని సైబరాబాద్, రామంగుండం, ఖమ్మం కమిషనరేట్‌లోని పోలీస్‌స్టేషన్లలో కొన్ని అప్‌గ్రేడ్ చేసినట్లు పోలీస్ వర్గాలలో చర్చ జరుగుతుంది. ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు పంపిన ప్రతిపాదనలను జిల్లా ప్రజాప్రతినిధులు సీఎం, మంత్రులకు వివరించి, అప్‌గ్రేడ్ చేయిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

అప్‌గ్రేడ్‌తో ఎన్నో ప్రయోజనాలు

ఠాణాలు అప్‌గ్రేడ్ అయితే సీఐలకు ఎస్‌హెచ్‌వో ఉంటారు. దీనితోపాటు స్టేషన్‌ను బట్టి ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల సంఖ్య పెరుగుతుంది. ఇటీవల 2024 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు పోలీస్‌స్టేషన్ స్థాయిని బట్టి 6నుంచి 10 మంది వరకు కేటాయించారు.

పోలీస్‌స్టేషన్లలో గతంలో కంటే కానిస్టేబుళ్ల సంఖ్య పెరగడంతో జిల్లాలో అప్‌గ్రేడ్ చేయడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. పోలీసులకు పదోన్నతులు లభించే అవకాశాలు ఉంటాయి. మరికొన్ని పోస్టులు పెరగడంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఇప్పటికైనా జిల్లాలో పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేస్తే క్రైమ్ రేటు తగ్గించడానికి అవకాశాలు ఉంటాయని పోలీసు వర్గాలలో చర్చ జరుగుతోంది. ఎప్పు డు మోక్షం లభిస్తుందో మరి.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సీఎం అండ



మోర్తాడ్‌: హైదరాబాద్‌లోని ఓ సినిమా థియేటర్‌లో ఇటీవల జరిగిన తొక్కిసలాటలో రేవతి మృతిచెందగా, గాయపడిన ఆమె కొడుకు, వారి కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలిచారని రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్‌ చైర్మన్‌, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు మాత్రం బాధిత కుటుంబానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. భీమ్‌గల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలకు ప్రజల ప్రాణాలకంటే సినిమా నటులే ప్రధానమైనారని ఎద్దేవా చేశారు. నాయకులు బొదిరె స్వామి, వెంకటేష్‌గౌడ్‌, ముత్యంరెడ్డి, నర్సారెడ్డి, నర్సయ్య, నాగేంద్రబాబు, చరణ్‌గౌడ్‌, అవినాష్‌, కన్నె సురేందర్‌, కుంట రమేష్‌, ఆడెపు గంగాప్రసాద్‌, గోపాల్‌ నాయక్‌, కల్పన, గంగామణి, మహేష్‌, అశోక్‌, శివ, కలీం, జుబేర్‌ తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో ప్రతిభ



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): తిరుపతిలో ఇటీవల టీటీడీ సౌజన్యంతో శ్రీకృష్ణ నటరాజాలయం కల్చరల్‌ డెవలప్‌మెంట్‌ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ భారత్‌ కల్చరల్‌ డాన్స్‌ ఫెస్టివల్‌–2024లో డిచ్‌పల్లి మండలం అమృతాపూర్‌ గ్రామానికి చెందిన కొట్టాల భవిష్య కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి, ప్రతిభ చాటింది. భవిష్య ప్రస్తుతం 4వ తరగతి చదువుతోంది. భవిష్య ప్రదర్శించిన నృత్యానికి ముగ్ధులైన ఆహుతులు చప్పట్లతో అభినందించారు.

కలెక్టరేట్‌లో ఘనంగా క్రిస్మస్‌ వేడుకలు



నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్‌ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌ ముఖ్య అతిథులుగా విచ్చేసి, క్రిస్మస్‌ కేక్‌ను కట్‌ చేసి, పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రెవెన్యూ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌, టీఎన్జీవో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన ప్రభుత్వ ప్లీడర్‌



ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన అమిదాల సుదర్శన్‌ సోమవారం జిల్లాకోర్టు ప్రాంగణంలోని ఇన్‌చార్జి జిల్లాజడ్జి కనకదుర్గను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా జడ్జి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదులు భాస్కర్‌, జయప్రకాష్‌ లోయ, ప్రభాకరన్‌రెడ్డి, మామిళ్ల సాయరెడ్డి, పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ధర్పల్లి రాజేశ్వర్‌రెడ్డి, బార్‌ అధ్యక్షుడు జగన్మోహన్‌ గౌడ్‌ తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 149 ఫిర్యాదులు

- ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌

నిజామాబాద్‌ అర్బన్‌: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నగరంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 149 ఫిర్యాదులు అందాయి.

కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుతోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మీ లిపి నుంచే అన్ని లిపులు





సమావేశంలో ప్రసంగిస్తున్న ఆచార్య జి.అరుణ కుమారి.. ఆచార్య రాజేశ్వరమ్మ

తెయూ(డిచ్‌పల్లి): బ్రాహ్మీ లిపి నుంచే అన్ని లిపులు ఆవిర్భవించాయని, ప్రతి లిపి మారడానికి సుమారుగా 400 సంవత్సరాలు పడుతుందని 'లిపి పరిణామ వికాసం –భారతీయ భాషలు' అనే గ్రంథంలో ఉందని కవయిత్రి ఆచార్య అరుణకుమారి తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు విభాగం, భారతీయ భాష సంరక్షక కేంద్రం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు అధ్యాపకులకు పునశ్చరణ తరగతులు సోమవారం కొనసాగాయి. అరుణకుమారి 'తెలుగు లిపి పరిణామం' అనే అంశంపై ప్రసంగించారు. ఆచార్య రాజేశ్వరమ్మ 'తెలుగు సాంస్కృతిక, వారసత్వ అధ్యయన ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. రచయిత తల్లావజ్ఝల మహేష్‌బాబు ప్రసంగిస్తూ.. అధ్యాపకులు విద్యార్థులతో సులభమైన మార్గంలో శతక రచనను చేపట్టేలా వారిని ప్రేరేపించాలని కోరారు. ఆచార్య రఘు ప్రసంగిస్తూ.. విద్యార్థులకు సరైన మెలకువలతో పాఠ్యాంశాలను బోధించాలన్నారు. నిర్వాహకులు లావణ్య, బత్తుల వెంకటేశ్వర్లు, లక్ష్మణచక్రవర్తి తదితరులు ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి:రాయితో కొట్టి జేబులో నుంచి డబ్బులు కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు సోమవారం తెలిపారు.వివరాలు ఇలా.. గౌతంనగర్‌కు చెందిన చందు, దుబ్బ ఏరియాకు చెందిన గంగా ప్రసాద్‌, అతని ఓనర్‌ రాజుతో కలిసి ఈ నెల 21న రాత్రి మద్యం తాగారు. గంగా ప్రసాద్‌ జేబులో డబ్బులను చందు చూసి, కొన్ని ఇవ్వమని అడిగాడు. కానీ అతడు డబ్బులు లేవని చెప్పడంతో రాయితో కొట్టి డబ్బులు, సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయాడు. గాయపడ్డ గంగాప్రసాద్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతని చెల్లెలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం మధ్యాహ్నం చందును పోలీసులు పట్టుకొని అతని వద్ద నుంచి రూ. 2వేలు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌ చేసినట్లు తెలిపారు.

విద్యార్థిని హేళన చేసిన టీచర్‌పై కేసు..

ఖలీల్‌వాడి: నగరంలోని కాకతీయ టెక్నోస్కూల్‌ టీచర్‌ 8వ తరగతి స్టూడెంట్‌ను హేళన చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు సోమవారం తెలిపారు. విద్యార్థి తండ్రి సితార కృష్ణ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాన్ని, సీఎంను విమర్శిస్తే ఊరుకోం

- అల్లు అర్జున్‌ పద్ధతి మార్చుకో
- రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



న్యాల్‌కల్‌ మాసాని చెరువు నుంచి నీటిని విడుదల చేస్తున్న రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై సినీ హీరో అల్లు అర్జున్‌ విమర్శలు మానుకోవాలని, పద్ధతి మార్చుకోకపోతే రాష్ట్రంలో సినిమాలు ఆడనివ్వబోమని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని న్యాల్‌కల్‌ మాసాని చెరువు నుంచి నిజాంసాగర్‌ కెనాల్‌ ఆయకట్టుకు సోమవారం ఆయన గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ పరిశ్రమకు కాంగ్రెస్‌ వ్యతిరేకం కాదని, ఎన్నో స్టూడియోలకు కాంగ్రెస్‌ ప్రభుత్వం భూములిచ్చిందని గుర్తుచేశారు. రైతు భరోసా ఇవ్వడం లేదని కేటీఆర్‌ రైతులకు ఉత్తరాలు రాస్తానడం సిగ్గుచేటని, ఇప్పటికే రైతులు బీఆర్‌ఎస్‌పై తిరగబడితేనే అధికారం కోల్పోయిన విషయాన్ని గుర్తెరగాలని హితవుపలికారు. జనవరి 15 తర్వాత వ్యవసాయానికి అనుకూలమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేస్తామన్నారు. న్యాల్‌కల్‌ గ్రామంలో ఇటీవల మరణించిన కాలూరి ప్రసాద్‌రావు, కంఠేగారి ఆదర్శ్‌కుమార్‌ కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అంతకుముందు గ్రామానికి సబ్‌స్టేషన్‌ మంజూరు కావడంతో స్థలాన్ని పరిశీలించారు.అనంతరం శ్మశాన వాటిక కోసం స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌గౌడ్‌, మునిపల్లి సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్లు గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు గంగాప్రసాద్‌, ప్రతాప్‌సింగ్‌, పసూల శ్రీనివాస్‌, అంజాగౌడ్‌, బట్టి శ్యామ్‌,సుభాష్‌, రఘు, సతీష్‌రెడ్డి, కిరణ్‌రావు, కాలూరి సతీష్‌రావు, విద్యాసాగర్‌, గంగాధర్‌, జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆఫీసర్స్‌ క్లబ్‌లో ఎన్నికల కోలాహలం



నామినేషన్‌ పత్రాలను దాఖలు చేస్తున్న తాహెర్‌

ఖలీల్‌వాడి: నగరంలో నిజామాబాద్‌ ఆఫీసర్స్‌ క్లబ్‌ ఎన్నికల కోలాహలం మొదలయ్యింది. క్లబ్‌ 2025 వార్షిక ఎన్నికల నిర్వహణకుగాను క్లబ్‌ సభ్యులు, సీనియర్‌ న్యాయవాది కిరణ్‌ కుమార్‌ గౌడ్‌ ప్రధాన ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు. సహాయకులుగా అసిస్టెంట్‌ ఎన్నికల అధికారులుగా బంటు వసంత్‌, ఉదయ కృష్ణ, ఎర్రం విగ్నేష్‌, దొన్పల్‌ సురేష్‌ నియమితులవగా, ఎన్నిక విధివిధానాలకు శ్రీకారం చుట్టారు. ఎన్నిక షెడ్యూల్‌ విడుదల చేసి, నామినేషన్లను స్వీకరించడం ప్రారంభించారు. క్లబ్‌ బైలా ప్రకారం జిల్లా కలెక్టర్‌ అధ్యక్షులుగా కొనసాగుతారు. ఉపాధ్యక్షులుగా పోలీస్‌ కమిషనర్‌, అదనపు కలెక్టర్‌ ఉంటారు. మరో ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక ఉంటుంది. కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు నామినేషన్లు స్వీకరించి ఎన్నిక నిర్వహిస్తారు. ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైన నేపథ్యంలో సోమవారం ఉపాధ్యక్ష పదవికి ప్రస్తుత ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌ హందాన్‌ మరోసారి పోటీ చేయడానికి వీలుగా నామినేషన్‌ పత్రాలను ప్రధాన ఎన్నికల అధికారి కిరణ్‌ కుమార్‌ గౌడ్‌కు అందజేశారు. కార్యదర్శి పదవికి భూపాల్‌రెడ్డి, నర్సారెడ్డి, స్వామిదాస్‌, సంయుక్త కార్యదర్శి పదవికి డాకం సాయిలు, కోశాధికారిగా పదవికి శరత్‌కుమార్‌ నామినేషన్‌ పత్రాలను దాఖలు చేసినట్లు తెలిపారు. 24న నామినేషన్‌ పత్రాల పరిశీలన, 25న నామినేషన్‌ పత్రాలను ఉపసంహరణకు అవకాశం కల్పించి, అదే రోజు పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నారు. 29న ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో సోమవారం జరిగిన వివిధ ఘటనల్లో పలువురు మృత్యువాత చెందారు. పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందగా, చెరువులో పడి ఒకరు, రైలు కింద పడి ఒకరు, కాలువలో పడి ఒకరు మరణించారు. ఇద్దరు రైతులు విద్యుత్‌షాక్‌తో ప్రాణాలు విడిచారు.

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం చేపూర్‌ గ్రామానికి చెందిన నడ్పి గంగారాం(58) చెరువులో పడి మృతిచెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నడ్పి గంగారాం ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంతవెతికినా అతడి ఆచూకీ కనిపించలేదు. సోమవారం అతడి మృతదేహం కొత్తకుంట చెరువులో బయట పడింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి..

నిజామాబాద్‌ రూరల్‌: చంద్రశేఖర్‌కాలనీకి చెందిన గట్టు మధు(20) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్‌ సోమవారం తెలిపారు. మధు ఆదివారం సాయంత్రం కల్లు తాగగా, అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి కాలనీలో ఉన్న కాలువలో పడి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ..



ఖలీల్‌వాడి: కామారెడ్డి– ఉప్పల్‌వాయి రైల్వే మార్గం మధ్యలో ఓ గుర్తుతెలియని మహిళ రైలు నుంచి కిందపడి మృతిచెందినట్లు నిజామాబాద్‌ రైల్వే ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. మహిళ వయస్సు 35–40 మధ్యలో ఉంటుందని, ఆమె వద్ద ఎలాంటి ఆచూకీ లభించలేదన్నారు. మృతురాలు లేత ఆకుపచ్చ కలర్‌ చీర అందులో పింకు కలర్‌ డిజైన్‌, పోక కలర్‌ జాకెట్‌ ఉందన్నారు. కాళ్లకు మట్టెలు, మెడలో దారంతో పుస్తెలతాడు ఉన్నట్లు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిసినచో రైల్వే ఎస్సై 8712658591కు సమాచారం అందించాలన్నారు.

ఆటో ఢీకొని ఒకరు..

మాక్లూర్‌:మండల కేంద్రంలోని నందిపేట రహదారిపై ఓ వ్యక్తి ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మాదాపూర్‌కు చెందిన అల్లం యాదగిరి (65) కూలి పని చేసుకుంటు జీవనం సాగించేవాడు. ఈక్రమంలో సోమవారం రోడ్డు దాటుతుండగా మాక్లూర్‌ నుంచి గాలిబ్‌నగర్‌ వైపు వెళుతున్న ఆటో వేగంగా వచ్చి, అతడిని ఢీకొట్టింది. దీంతో యాదగిరి తలపగిలి అక్కడికక్కడే మృతిచెందారు. పంచనామ నిర్వహించి, ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



నవీపేట: నవీపేట శివారులోని ఫతేనగర్‌ ఫస్ట్‌ప్లాట్‌ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నవీపేటకు చెందిన కూలీ మేస్త్రీ జాంబి సాయిలు(38) రెంజల్‌ నుంచి నవీపేట వైపు రోడ్డుపై కాలినడకన నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

నవీపేట: ఓ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వినయ్‌ సోమ వారం తెలిపారు. మండలంలోని రాంపూర్‌ గ్రామానికి చెందిన చిన్నోళ్ల పోశెట్టి(48) ఈనెల 15న ఇంటి ఆవరణలోని చెట్టు కొమ్మలను నరుకుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో రైతు..

టీటీపేట: పొలం పనులకు వెళ్లిన రైతు విద్యుత్‌ షాక్‌ తగిలి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని యాడారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన వడ్ల సీతారాములు (50) తన పొలం పనుల నిమిత్తం ఆదివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమారుడు బావివద్దకు వెళ్లి చూడగా పక్కనున్న పొలంలో మృతిచెంది కనిపించాడు. మృతుడు పొలం ఒడ్లపై వెళ్లే క్రమంలో జారి పడుతుండగా పక్కనే ఉన్న విద్యుత్‌ వైర్‌ పట్టుకోవచ్చని, దీంతో విద్యుత్‌ షాక్‌ తగిలి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి భార్య చిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోర్తాడ్‌ మండలంలో..

మోర్తాడ్‌: మండలంలోని డొక్కల్‌లో సోమవారం ఓ రైతు విద్యుత్‌షాక్‌తో మరణించాడు. గ్రామానికి చెందిన ఓల్లెం సంతోష్‌ (30) సోమవారం పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌ సరఫరా కావడంతో షాక్‌ తగిలి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): అంత్యక్రియలకు వెళ్లి వస్తూ ఓ వ్యక్తి అనంతలోకాలకు వెళ్లిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని మర్కల్‌ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జనగాం గ్రామానికి చెందిన సాకలి చిన్న రాజయ్య(55), భార్య శివరాజవ్వలు మర్కల్‌లో బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు మర్కల్‌ చౌరస్తా వద్ద రోడ్డు క్రాస్‌ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందగా, భార్య శివరాజవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వచ్చి వెళ్తూ..



శివాని (ఫైల్‌)

దోమకొండ: తన చిన్ననాటి మిత్రులు ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని, తిరిగి తన ప్రాంతానికి వెళ్తుండగా ఓ యువతి రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. మృతురాలి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండకు చెందిన మాజీ సర్పంచ్‌ ఐరేని నర్సయ్య కూతురు శివాని (21) హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సీబీఐటీ కాలేజీలో బీటెక్‌ ఫైనల్‌ ఇయర్‌ చదువుతుంది. శివాని గతంలో నిజాంసాగర్‌ నవోదయ పాఠశాలలో చదువగా.. ఆదివారం నిజాంసాగర్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైంది. కార్యక్రమం అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడి నుంచి తన పూర్వ విద్యార్థి బైక్‌పై గచ్చిబౌలికి వెళుతుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో శివాని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌ నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శివాని మృతదేహన్ని స్వగ్రామానికి తీసుకురాగా, సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడిపై హత్యాయత్నం

ఆర్మూర్‌టౌన్‌: పెర్కిట్‌కు చెందిన షేక్‌ తహీర్‌ అనే యువకుడిపై జిరాయత్‌నగర్‌కు చెందిన ముగ్గురు యువకులు ఆదివారం అర్ధరాత్రి కత్తితో దాడి చేసి, హత్యకు యత్నించిన ఘటన కలకలం సృష్టించింది. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా.. తహీర్‌కు జిరాయత్‌ నగర్‌కు చెందిన ఓ అమ్మాయితో ఎంగేజ్‌మెంట్‌ జరిగింది. కాగ రాత్రి జిరాయత్‌ నగర్‌కు వచ్చిన తహీర్‌తో షాహిద్‌, మోహిత్‌, వాజిద్‌లు గొడవకు దిగగా, తాహెర్‌ వీపుపై కత్తితో పొడిచారు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఆర్మూర్‌ ఆస్పత్రికి తరలించి, అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మోపాల్‌లో యువకుడి ఆత్మహత్య



జక్కు నవీన్‌ (ఫైల్‌)

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలకేంద్రానికి చెందిన జక్కు నవీన్‌ (29) ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నవీన్‌ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి అతడిని నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ గొడవల కారణంగానే నవీన్‌ పురుగుల మందు తాగినట్లు సమాచారం. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ల అందజేత

సిరికొండ: మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన రాజన్న, కొండూర్‌ గ్రామానికి చెందిన గర్గుల రాములుకు సెల్‌ ఫోన్లను ఎస్సై ఎల్‌ రామ్‌ సోమవారం అందజేశారు. బాధితులు సెల్‌ ఫోన్లు పోగొట్టుకోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్‌ యాప్‌ ద్వారా విచారణ చేసి ఫోన్లను కనుగొని బాధితులకు అందజేశారు.

హమాల్‌వాడిలో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని హమాల్‌వాడిలోగల ఓ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై హరిబాబు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. కాలనీకి చెందిన అనురాధ తన కుమారుడితో కలిసి ఇంట్లో ఉంటుండగా, ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఫంక్షన్‌ కోసం వెళ్లారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని బంగారం, కొంత వెండి ఆభరణాలు, కొంత నగదు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. కాలనీలోని మరో ఇంట్లో దొంగతనం చేయడానికి ప్రయత్నం చేసినట్లు తెలుస్తోందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. నగరంలో మహారాష్ట్ర దొంగల ముఠా తిరుగుతున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ కాయిల్స్‌, ఆయిల్‌ చోరీ

బాల్కొండ: ముప్కాల్‌ మండల పరిధిలో లక్ష్మీకాలువ పక్కన గల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి ఆదివారం అర్ధరాత్రి గుర్తితెలియని దుండగులు ఆయిల్‌, కాపర్‌ కాయిల్స్‌ను చోరీ చేసినట్లు స్థానికులు, ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఈమేరకు ముప్కాల్‌ సెక్షన్‌ ఏఈ శ్రీనివాస్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డయల్‌ 100 దుర్వినియోగం: ఇద్దరికి రెండురోజుల జైలు

జక్రాన్‌పల్లి: మద్యం మత్తులో డయల్‌ 100కు కాల్‌ చేసి పోలీసు సేవలను దుర్వినియోగం చేసిన ఇద్దరు నిందితులకు ఆర్మూర్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని నల్లగుట్ట తండాకు చెందిన బానవత్‌ రవీందర్‌, గన్యాతండాకు చెందిన లకావత్‌ సురేష్‌లు మద్యం తాగి, డయల్‌100కు కాల్‌ చేసి పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేశారన్నారు. దీంతో నిందితులను కోర్టులో హాజరు పరుచగా, జడ్జి శిక్ష విధించినట్లు తెలిపారు.

రాణంపల్లి యువకుడి అదృశ్యం



యోగేష్‌

రుద్రూర్‌: మండలంలోని రాణంపల్లి గ్రామానికి చెందిన సున్నం యోగేష్‌ (25) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న సోమవారం తెలిపారు. ఈనెల 21న మధ్యాహ్నం బైక్‌పై బోధన్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరిన యోగేష్‌ ఇప్పటివరకు తిరిగి రాలేదన్నారు. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో యోగేష్‌ తండ్రి దత్తాద్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడి ఆచూకీ ఎవరికైన లభ్యమైతే 8712659876కు తెలియజేయాలని కోరారు.

ముప్కాల్‌ మండలంలో..



సయ్యద్‌ సమీర్‌

బాల్కొండ: ముప్కాల్‌ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన సయ్యద్‌ సమీర్‌(21) అదృశ్యమైనట్లు ఎస్సై రజనీకాంత్‌ తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 19న మధ్యాహ్నం నిజామాబాద్‌కు సినిమాకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన సమీర్‌ ఇప్పటి వరకు తిరిగి రాలేదన్నారు. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో తల్లి హమీదా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌ లింక్‌తో రూ.30వేలు మాయం

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ లింక్‌ను ఓపెన్‌ చేసిన యువకుడికి తన బ్యాంక్‌ ఖాతా నుంచి రూ.30వేలు మాయమైన ఘటనలో మండలంలోని బాడ్సి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. బాడ్సి గ్రామానికి చెందిన కల్లూరి నరేష్‌ రోజులాగే ఇన్‌స్టా రీల్స్‌ చూస్తుండగా, ఓ లింక్‌ వచ్చింది. దానిని ఓపెన్‌ చేయగానే వాట్సాప్‌ లాగిన్‌ అయ్యింది. అందులో వచ్చిన చిన్న చిన్న టాస్క్‌లు పూర్తి చేయగా, రివార్డులు వచ్చాయి. ఉత్సాహంగా కొనసాగిస్తుండగా నరేష్‌ ఖాతాలో నుంచి విడతల వారీగా రూ.30వేలు కట్‌ అయ్యాయి. దీంతో అప్రమత్తమైన నరేష్‌ లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సైబర్‌ క్రైమ్‌ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

యంచ మహరాజు కన్నుమూత



ఉదాసీన స్వామి(ఫైల్‌)

నవీపేట: మండలంలోని యంచ గ్రామంలో గత ఐదేళ్లుగా ఆలయాలలో పూజలు నిర్వహిస్తున్న సర్వేశ్వారానంద ఉదాసీన స్వామి(73) (మహరాజు) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. మాజీ పీఎం పీవీ నరసింహరావ్‌ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగిన స్వామీజీకి తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడులలో శిష్యులు ఉన్నారు. పలు పుస్తకాల రచనలతో పేరు గడించిన ఆయనను గతంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. యంచ గ్రామస్తులు, శిష్యులు ఆయన అంత్యక్రియలను నిర్వహించారు.

బోల్తాకొట్టిన కారు



నిజామాబాద్‌ రూరల్‌: మాధవనగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఓ కారు బోల్తా కొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన భాస్కర్‌కిషోర్‌కు తీవ్రగాయాలు అయినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయంపై రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేని వివరించారు. కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలు అయినట్లు సమాచారం.